# విషవలయం

ఆంగ్లమూలం: బ్రియన్ కోటే
అనువాదం: కొల్లూరి సోమ శంకర్

**జా**ర్జికి హఠాత్తుగా మెలకువ వచ్చింది. దూరంగా గోడపై కాంతి ప్రసరిస్తోంది. అది ఆగుతూ, వెలుగుతూ వుంది. ఒక్కోసారి కనబడుతోంది. మరోసారి కనబడటం లేదు. జార్జి కంగారు పడ్డాడు. అతడికి ఏమీ అర్థం కాలేదు. మంచం మీద నుంచి లేచాడు. మెల్లగా గోడవారగా నక్కినక్కి వెళ్లి, కటికీలోంచి తొంగి చూశాడు. వీధి దీపం వెలుతురులో తన ఇంటి ముందున్న ఓ పార్కు చుట్టూ ఒక పాత మోడల్ కాడిలాక్ కారు ప్రదక్షిణం చేయడం గమనించాడు. దాని హెడ్‌లైట్ వెలుతురు ప్రతి రెండు సెకన్లకొకసారి కిటికీ గుండా పరదాలను దాటి వచ్చి గోడలపై క్రీనీడను ఏర్పరుస్తోంది. వీధిలో ఒకే దీపం వుంది. చుట్టుపక్కల ఇళ్లన్నీ చీకటిలో వున్నాయి. ఈ నిశ్శబ్ద వాతావరణంలో చలిస్తున్నది ఆ కారు ఒకటే.






జార్జి ఇల్లు చాలా వరకు ఖాళీ. ఒకే కుర్చీ, ఒక టీవీ వున్న లివింగ్ రూమ్ దాటి, ఇంటి బయటకు వచ్చాడు. తన ఇంటి తలుపులని దగ్గరగా వేసి, మెట్లు దిగి గట్టిగా శ్వాస పీల్చుకుని చీకటిలోకి అడుగుపెట్టాడు. కాళ్లకి చెప్పులు లేకుండా, మంచులో తడిసిన పచ్చికపై నడవసాగాడు. పైజమాలో చేతులు పెట్టుకుని, వృత్తాకారంలో తిరుగుతున్న కారుని గమనించసాగాడు. పరీక్షగా చూస్తే, స్టీరింగ్ వీల్ వెనుక ఓ నల్లటి ఆకారం కనిపించింది. బహుశా ఆ డ్రైవరు జార్జిని చూసి వుండడు. ఎందుకంటే కారు ఆగలేదు.

జార్జికి కోపం ఆగలేదు. కారు తన వైపు వచ్చినప్పుడు, దాని తలుపు మీద గట్టిగా కొట్టాడు. ''ఏయ్'' అంటూ అరిచాడు. కారు ఆగలేదు. 'సరే మళ్లీ వస్తుందిగా' అని అనుకున్నాడు. మళ్లీ ఈసారి తనవైపు వచ్చినప్పుడు దానితోపాటూ పరిగెత్తి, దాని పైభాగాన గట్టిగా కొట్టాడు. ''ఏయ్'' అంటూ అరిచాడు. కాని కారు ఆగలేదు. మూడోసారి కారు తనవైపు తిరిగినప్పుడు, దానికి అడ్డంగా నిలుచుని బలవంతంగా ఆపాడు. కారు బాయ్‌నెట్‌పై చేతులు వేసి, ''ఏం నాయనా, ఏంటి సంగతి; ఎందుకిలా కారు నడుపుతూ అందరి నిద్రా పాడు చేస్తున్నావు?'' అని అడిగాడు. ఇంజను వేడికి జార్జి చేతులు కాలాయి. అయితే మసకగా కనిపిస్తున్న డ్రైవరు ఏమీ మాట్లాడలేదు. జార్జిని లోపలికి రమ్మన్నట్లుగా ముందు తలుపు తీసి పట్టుకున్నాడు. ఒక నిమిషం పాటు ఆలోచించి, జార్జి కారు లోపల కూర్చున్నాడు.

డ్రైవరు ఏమీ మాట్లాడకుండా గేరు మార్చి మళ్లీ గుండ్రంగా తిప్పసాగాడు. అతడిని పరిశీలనగా చూశాడు జార్జి. చిన్నవాడే. వయసు 25-25 సంవత్సరాలు వుండచ్చు. వేసుకున్న బట్టలు ముతగ్గా, మాసిపోయి వున్నాయి. కట్టుకున్న టై ఎప్పటిదో! కొద్దిగా గడ్డం పెరిగింది. అలసినట్లుగా కనబడుతున్నా, అతడి కళ్లలో ఏకాగ్రత కనబడుతుంది. అతడి బాహ్యరూపానికి పూర్తి వ్యతిరేకంగా, కారు లోపల అన్నీ దాదాపుగా సక్రమంగా అమర్చి వున్నాయి. 'డోర్ మాట్' ల కింద దుమ్ము ఏ మాత్రం లేదు. సరిగ్గా లేనివి రెండే రెండు. దినపత్రిక వెనకసీట్లో విసిరేసి వుంది. కోడి గుడ్డతో వున్న ఒక అట్ట పెట్టె డాష్‌బోర్డుకి, ముందు కిటికీ అద్దానికి రాసుకుంటోంది. డ్రైవరుకేసి ఆందోళనగా చూశాడు జార్జి.

''నీ సమస్య ఏంటి మిస్టర్? ఈ సమయంలో ....'' అంటూ డాష్ బోర్డులోని గడియారం కేసి చూశాడు. సమయం తెల్లవారు జామున మూడు గంటలవుతోంది. ''జనాలందరూ నిద్రపోయే సమయంలో ఈ విధంగా కారు నడపటంలో నీ ఉద్దేశం ఏమిటి? అని అతడిని అడిగాడు జార్జి. డ్రైవరు మౌనంగా వుండిపోయాడు.

''నేను అడిగేది వినిపిస్తోందా మిస్టర్?'' అంటూ చికాకుగా రెట్టించాడు జార్జి.

''నీ మాటలు నాకు వినబడ్డాయి. కాని ఇక్కడి నుంచి బయటపడడానికి నాకు మరో మార్గం కనబడటం లేదు. నాకు దారితెలిస్తే ఇలా తిరగను. నన్ను నమ్ము'' అన్నాడు ఆ డ్రైవరు.

''నువ్వు ఏం మాట్లాడుతున్నావో నాకు అర్థం కావడం లేదు'' చెప్పాడు జార్జి.

''ఇక్కడ, ఇలా రోడ్డు మీద గుండ్రంగా తిరగడం గురించి మాట్లాడుతున్నాను. ఈ వలయం నుంచి బయటపడగలిగితే, ఇలా పిచ్చిగా కారు నడపాల్సిన అవసరం లేదు'' అన్నాడా డ్రైవరు.

''కాని నువ్వు నిజంగా పిచ్చివాడిలాగే కారు నడుపుతున్నావు'' అన్నాడు జార్జి.

''నేను చిక్కుకుపోయాను'' చెప్పాడు ఆ డ్రైవరు.

''చిక్కుకుపోయావా? ఎక్కడ? అసలిక్కడ ఎందుకున్నావు? తెల్లవారుఝామున మూడు గంటలకి మా ఇంటి ముందు కారెందుకు తిప్పుతున్నావు? ఎందుకు అందరికీ నిద్రాభంగం కలిగిస్తున్నావు? రేపు ఉదయమే అందరు పనులకి వెళ్లాలి. రేపేమీ ఆదివారం కాదు. బుధవారం! ఇంతకీ నీ సమస్య ఏమిటి?'' అంటూ అసహనంగా అడిగాడు జార్జి. తికమకగా వున్న ఓ చిన్నపిల్లాడిని చూసినట్లుగా జార్జిని చూశాడా డ్రైవరు.

''విషవలయం అనేమాట ఎప్పుడైనా విన్నావా?'' అని జార్జిని అడిగాడతడు.

''విన్నాను. ఒక వాదనని మనం ఊహించినప్పుడు, దానిలో నిజం వుందని నమ్ముతాం. ఉదాహరణకి ''నేను దేవుడిని నమ్ముతాను'' అనే వాదనని తీసుకుంటే, దేవుడు వున్నాడని పవిత్ర గ్రంథం చెబుతోంది కాబట్టి దాన్ని నిజమని నమ్ముతాం. పవిత్ర గ్రంథం నిజమెలా అయింది? దీనికి జవాబుగా 'దాన్ని సృష్టించింది స్వయంగా దేవుడే' అని వాదిస్తాం కదా. ఇక్కడ నిజానికి మనం చెప్పింది ఏమీ లేదు. కొత్తగా నిరూపించిందీ ఏమీ లేదు. ఇదంతా తర్కపు వలయం'' అన్నాడు జార్జి.

''నిజమే'' అంటూ తలూపాడు డ్రైవరు. మళ్లీ తనే మాట్లాడుతూ, ''జీవితంలో నేను కూడా ఇక్కడే ఇరుక్కుపోయాను. నేను అన్నింటిని చక్కగా ఊహించుకున్నాను. అయితే నేను బయటపడలేని వలయంలో చిక్కుకుపోయాను. కాని బయటపడాలి. ఈ మధ్యే నా వివాహం నిశ్చయమైంది. కాని రెండు రోజుల క్రితం నా ఉద్యోగం పోయింది. మిత్రులని, కుటుంబాన్ని వదులుకోవాల్సి వచ్చింది. విధి నన్ను సుడిలోకి లాగేసింది. దీన్నుంచి ఎలా బయటపడాలో నాకు తెలియడం లేదు. నా జీవితం ఛిన్నాభిన్నం అవుతోంది. ఆప్తమిత్రులు సైతం సహాయం చేయడం లేదు. బంధు

ఒక వాదనని మనం ఊహించినప్పుడు, దానిలో నిజం వుందని నమ్ముతాం. ఉదాహరణకి ''నేను దేవుడిని నమ్ముతాను'' అనే వాదనని తీసుకుంటే, దేవుడు వున్నాడని పవిత్ర గ్రంథం చెబుతోంది కాబట్టి దాన్ని నిజమని నమ్ముతాం. పవిత్ర గ్రంథం నిజమెలా అయింది? దీనికి జవాబుగా 'దాన్ని సృష్టించింది స్వయంగా దేవుడే' అని వాదిస్తాం కదా. ఇక్కడ నిజానికి మనం చెప్పింది ఏమీ లేదు. కొత్తగా నిరూపించిందీ ఏమీ లేదు. ఇదంతా తర్కపు వలయం''

వులు ఆసరా ఇవ్వలేదు. అయితే ఒక్కోసారి నాకు దేనిని గురించీ పట్టించుకోకూడదనిపిస్తుంది. ఇలాంటి సంఘటనలకు కుంగిపోకూడదనిపిస్తోంది. ఇదే వింతగా వుంది. ఎందుకంటావు'' అని అడిగాడు.

''నాకు తెలియదు'' చెప్పాడు జార్జి.

''నాక్కూడా తెలియదు. కాని నేను సుడిలో ఇరుక్కుపోయాను. నేను తలచుకుంటే, ఈ వలయం నుంచి బయటపడగలను. నేనిక్కడే వుండిపోయి, నా కాబోయే భార్యకి దూరం కాగలను. లేదా వివాహ నిశ్చయాన్ని రద్దు చేసుకోగలను. కాని అది సమస్యని మరీ తీవ్రం చేస్తుంది. ఇక్కడే నేను ఇరుక్కుపోయాను. నేనేం చేసినా, సమస్య మరీ జటిలమవుతుంది. ఇదే నన్ను కుంగదీస్తోంది. ఏ అవకాశాన్ని పరిశీలించినా, కష్టంగానే తోస్తోంది. నేనేం చేయాలిప్పుడు?'' అడిగాడా డ్రైవరు.

''నాకేం తెలుసు?'' అన్నాడు జార్జి.

''ఎవరికీ తెలీదని నాకు తెలుసు. అందుకే ఇలా ఒంటరిగా, కారుని గుండ్రంగా తిప్పుతూ వలయంలో తిరుగుతున్నాను. పైగా ఈ వలయాన్ని సృష్టించిందే నేను కదా! నిజానికిదే ముఖ్యం! నేను సృష్టించిన వలయంలోంచి సులువుగా బయటపడచ్చని అనుకున్నాను. కారుని చాలాసేపు గుండ్రంగా తిప్పితే, కొంతసేపయ్యాక మనం స్టీరింగ్ తిప్పకపోయినా, కారు దానంతట అదే నడుస్తుంది. అంటే విధి దాన్ని తన చేతులలోకి తీసుకుంటుందన్న మాట!'' అన్నాడు ఆ డ్రైవరు.

''నువ్వు ఏమంటున్నావో నాకర్థం కావడం లేదు'' చెప్పాడు జార్జి.

''నా మాటలు తికమకగా వున్నాయా? ఇవాళ కాకపోతే రేపైనా జరగబోయేదదే. ఈ కారుని వలయంలోంచి బయటకు తేగలిగితే నా సమస్యల సుడినుంచి కూడా నేను బయటపడగలనని నాకు తోస్తోంది. తర్కపు లంకెలని తెంచగలనని అనిపిస్తోంది. నా జీవితంలోని ముఖ్యమైన నిర్ణయాలని విధికి వదిలేయక. స్వయంగా నేనే తీసుకోగలుగుతాను'' చెప్పాడా డ్రైవరు.

''ఇలా గుండ్రంగా గిరగిరా తిరగడం ద్వారా నా?'' వ్యంగ్యంగా అన్నాడు జార్జి.

''నా కష్టాలన్నీ నీకు విసుగ్గా వుండవచ్చు'' అంటూ జార్జి వుంటున్న రెండంతస్తుల భవనం కేసి చూశాడు. ''మంచి ఇంట్లో వుంటున్నావు. నీకేమీ సమస్యలు వున్నట్లు లేవు'' అని అన్నాడా డ్రైవరు.

''లేకేం, సమస్యలు నాకున్నాయి'' చెప్పాడు జార్జి.

''ఎలాంటి సమస్యలు?'' ప్రశ్నించాడు డ్రైవరు.

''అసలు నువ్వెవరు? నీకు అన్నీ నేనెందుకు చెప్పాలి?'' అడిగాడు జార్జి.

''నేనో కారు నడిపే వ్యక్తిని'' చెప్పాడా డ్రైవరు.

''నాకు బోలెడు సమస్యలున్నాయి. కాని నేను వాటిని పరిష్కరించుకోగలను'' చెప్పాడు జార్జి.

''ఓహో, అయితే నువ్వు నాకైనా మెరుగైన స్థితిలో వున్నావన్నమాట! నీకు నిజంగానే నీ సమస్యలని చెప్పుకోవాలని లేదా? '' అన్నాడా డ్రైవరు.

''లేదు'' అని బదులిచ్చాడు జార్జి. ఇంతలో కారు కుదుపులకి కోడి గుడ్లున్న అట్టపెట్టె జారిపోయింది. జార్జి గబుక్కున దాన్ని పట్టుకున్నాడు. డ్రైవరు చిన్నగా నవ్వి, '' ఇవి చాలా సున్నితమైనవి. బాగా పట్టుకున్నావు'' అని అన్నాడు డ్రైవరు. అట్టపెట్టె నుంచి ఒక గుడ్డుని బయటకు తీసి తన ముఖం ముందు ఆడించసాగాడు.

''వలయం నుంచి బయటపడాలంటే, దాంట్లోనే తిరగకూడదు. దాన్ని ఛేదించాలి''

''ఇదీ గుండ్రంగానే వుంది. నీకు తెలుసా? ఈ రోజులలో ఎవరూ అసలైన కోడిగుడ్లని వాడటం లేదు. ఇష్టం లేక కాదనుకో! ఆశ్చర్యమేమిటంటే, ఈ గుడ్లు కోడినుంచే వస్తాయి. కాని వీటిలోంచి కోడి పిల్లలు రావు. ఎందుకంటే వీటిలో పిండం వుండదు. విచిత్రంగా లేదూ?'' అన్నాడు.

''అవును'' అన్నాడు జార్జి. ఇద్దరూ కాసేపు మౌనంగా వుండిపోయారు.

''సరే, నేను నా ప్రయాణాన్ని కొనసాగించాలి. మనం తర్వాత కలుద్దాం'' అన్నాడా డ్రైవరు. జార్జి కిందికి దిగి తలుపు వేయబోతుండగా... ''ఒక్కని మిషం'' అన్నాడు డ్రైవరు. ఏమిటన్నట్లు డ్రైవరు కేసి చూశాడు.

''ఇదిగో, ఈ గుడ్డు తీసుకో'' అంటూ అప్పటి దాకా చేతిలో పట్టుకున్న గుడ్డుని జార్జికి అందించాడు డ్రైవరు.

''థాంక్స్, బై'' అంటూ ఆ గుడ్డుని చేతిలో వుంచుకుని తన ఇంటివైపు నడవసాగాడు జార్జి.

కారు మళ్లీ గుండ్రంగా తిరగసాగింది. దాని హెడ్ లైట్‌కాంతి చుట్టు పక్కల ఇళ్లపై పడసాగింది. జార్జి తన చేతిలోని గుడ్డుని ఎగరేసి పట్టుకున్నాడు. వున్నట్లుండి ఆ గుడ్డుని కారు అద్దం కేసి గట్టిగా విసిరాడు. అది అద్దానికి తగిలి పగిలిపోయింది. లోపలి సొన అంతా కారు అద్దాలపై పడింది.

''వలయం నుంచి బయటపడాలంటే, దాంట్లోనే తిరగకూడదు. దాన్ని ఛేదించాలి'' అంటూ గట్టిగా అరిచి, తలుపు తీసుకుని లోపలికి వెళ్లిపోయాడు. గుమ్మం దగ్గర నిలుచుని డ్రైవర్ ఏమంటాడో అని వినసాగాడు.

డ్రైవరు నవ్వుతున్నాడు. ''నువ్వు నాకన్నా మెరుగైన స్థితిలో వున్నావు మిత్రమా!'' అని అరిచాడు డ్రైవరు. తర్వాత మూడు సార్లు హారన్ గట్టిగా మ్రోగించాడు. వాతావరణంలోని నిశ్శబ్దం ఒక్కసారిగా బద్దలైంది. కారు చీకటిని చీల్చుకుంటూ, వీధిలోంచి వెళ్లిపోయింది. ★

